

## మూగబోతున్న స్వరాలు..
- సంగీత కళాశాలలో సమస్యల తిష్ఠ 6



మంథని సంగీత కళాశాలలో సాధన చేస్తున్న విద్యార్థులు

## లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలి
- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ 8



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

# కొండెక్కిన కోడిగుడ్డు..

- ఒక్కో గుడ్డు ధర రూ.7.20
- రిటైల్‌గా రూ.8కి అమ్మకం
- జిల్లాలో నెలకు 8 లక్షల నుంచి 8.50 లక్షల వరకు వినియోగం
- నాలుగు మాసాలుగా పెరుగుతున్న ధరలు
- మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులపై భారం




కోడిగుడ్ల ధరలు

| నెల | ధర |
|---|---|
| ఆగస్టు | 5.70 |
| సెప్టెంబరు | 6.25 |
| అక్టోబరు | 6.29 |
| నవంబరు | 6.50 |
| డిసెంబరు | 7.20 |

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కోడిగుడ్డు ధరలు కొండెక్కాయి. నెల రోజుల నుంచి ధరలు పెరగుతూనే ఉన్నాయి. దీంతో ప్రభు త్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుచేస్తున్న నిర్వాహకులు, గురుకుల విద్యాల యాలకు కోడిగుడ్లను సరఫరా చేస్తున్న వారిపై అదనపు ఆర్థిక భారం పడు తున్నది. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వారితో పాటు తెలుగు రాష్ట్రాల ప్రజలు కోడిగుడ్డు అధికంగా తిం టారు. జిల్లాలో ప్రతి నెలా దాదాపు 8 లక్షల నుంచి 8.50లక్షల కోడి గుడ్లు అమ్ముడు పోతున్నాయి. ఉడక బెట్టిన కోడిగుడ్లతో పాటు ఆమ్లెట్లు వేసుకోవడం, కూర వండుకుని తింటారు. గత నెలలో 6 రూపాయల 50 పైసలున్న ఒక కోడి గుడ్డు ధర 7 రూపాయల 20కి చేరుకున్నది. రిటైల్ షాపుల్లో 7 రూపాయల 50 పైసల నుంచి 8 రూపాయలకు విక్రయిస్తున్నారు. సాధార ణంగా ప్రతి ఏటా నవంబర్, డిసెంబర్ మాసంలో కోడిగుడ్ల ధరలు సాధారణ రోజుల్లో కంటే అధికంగానే ఉంటాయి. ప్రతి ఏటా డిసెంబర్ 25వ తేదీ క్రిస్మస్ వేడుకలు, జనవరి 1వ తేదీన న్యూ ఇయర్ వేడుకలు జరుగుతుంటాయి. అలాగే చలికాలంలో కోడిగుడ్లు 20 రోజుల వరకు నిల్వ ఉంటాయి. వేసవి కాలంలో 10 నుంచి 12 రోజుల పాటే నిల్వ ఉంటాయి. దీంతో కోడి గుడ్లకు డిమాండ్ బాగా పెరిగింది. ఈ సీజన్‌లో కోడిగుడ్ల వాడకం బాగానే ఉంటుంది. క్రిస్మస్ వేడుక లకు ఎక్కువగా కేకులు కట్ చేస్తారు. విద్యా సంస్థలు, కాలనీలు, చర్చిల్లో, క్రిస్టియన్ కుటుంబాల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు జరుగుతూ ఉంటాయి. డిసెంబర్ 31రాత్రి న్యూ ఇయర్‌కు స్వాగతం పలికే కార్యక్రమాలు జరుగు తుంటాయి. ఈ వేడుకల్లో కేక్ కట్ చేయడం ప్రధానం. కేకుల తయారీలో ఎక్కువగా కోడిగుడ్లను ఉపయోగిస్తుంటారు. పెద్దపల్లి, రామగుండం, గోదావరిఖని, మంథని, సుల్తానాబాద్, సెంటినరీ కాలనీ, కమా న్‌పూర్, ధర్మారం, ఓదెల, ముత్తారం, రామగిరి, కాల్వశ్రీరాంపూర్, ఎలిగేడు, జూలపల్లి తదితర మండలాల్లో 120కి పైగా బేకరీలు

మిగతా 8వ పేజీలో...

> జిల్లాలో 20కి పైగా కోళ్ల ఫారాలు ఉండగా, ఇందులో కోడిగుడ్లు పెట్టే కోళ్ల ఫారాలు 8 వరకు ఉన్నాయి. ఆ ఫారాల యజమానులు స్థానికంగా ఉండే రిటైల్ వ్యాపారులకే గాకుండా ఇతర జిల్లాల్లో ఉన్న వ్యాపారులకు కూడా సరఫరా చేస్తూ ఉంటారు. ఈ కోళ్ల ఫారాల ద్వారా నెలకు 4 లక్షల వరకు కోడిగుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. జిల్లా అవసరాలకు ఇతర జిల్లాల నుంచి కూడా కోడిగుడ్లు సరఫరా అవుతున్నాయి. గత నాలుగు మాసాల నుంచి కోడిగుడ్ల ధరలు పెరుగుతున్నాయి.

న్యూస్ బాక్స్

### బాలసదనం, వృద్ధాశ్రమ పనులు వేగవంతం చేయాలి

సుల్తానాబాద్, డిసెంబరు 17: (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ మార్కండేయ కాలనీలో కొనసాగుతున్న బాలసదనం, ఆనాథ ఆశ్రమం వృద్ధాశ్రమ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబందిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ నిర్మాణపు పనులను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. పలువురు అధికారుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. పనులు అలస్యంగా జరుగుతున్నాయని వేగవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట పంచాయతీ రాజ్ అధికారులు జిల్లా సంక్షేమ శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు

### సింగిల్‌విండోలో నిధుల దుర్వినియోగంపై విచారణ

సుల్తానాబాద్, డిసెంబరు 17: (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రెపల్లి సింగిల్ విండోలో నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సహకార శాఖ అధికారులు మంగళవారం విచారణ జరిపారు. పెద్దపల్లి డీసీవో కార్యాలయం నుంచి వచ్చిన వెంకటేశ్వర్లు అనే అధికారి గర్రెపల్లి సింగిల్‌విండోలో విచారణ జరిపారు. సీఈవో నబియోద్దిన్ నుంచి వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు. సింగిల్‌విండో భవనం కోసం ఎంత స్థలం కొన్నారు, ఎంత ధరకు మాట్లాడారు, ఎన్ని లక్షలు చెల్లించారు అనే వివరాలను నమోదు చేసుకున్నారు. భూమి విక్రయించిన వ్యక్తి నుంచి కూడా వివరాలను రాబట్టారు. అందరి వాంగ్మూలాలు నమోదు చేశామని పూర్తి విచారణ అనంతరం నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారి తెలిపారు.

## మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల నిరసన

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ప్రోగ్రెసివ్ మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుముల పోచయ్య కోరారు. మంగళవారం మండలంలోని మల్యాల ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు మోడల్ స్కూల్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ప్లకార్డ్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అనుముల పోచయ్య మాట్లాడుతూ 11 సంవత్సరాలుగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యల సాధనకు పోరాతున్నామని, ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆకుల రమేష్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, రాజ్యలక్ష్మి, శ్రీధర్‌బాబు, సంధ్య, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, స్నేహలత, అనిల్, రాధాకృష్ణ, సంధ్య, విజయ్, అనిత, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ప్రకటించాలి
- యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి




ర్యాలీగా వస్తున్న ఆశా వర్కర్లు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):ఆశావర్కర్లకు నెలకు 18 వేల రూపాయల ఫిక్స్‌డ్ వేతనం ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర బస్సుజాతా మంగళవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. ప్రభుత్వ ఐటీఐగ్రౌండ్ నుంచి తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో జయలక్ష్మి మాట్లాడుతూ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా ఆశాలకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని, అధిక పని భారాన్ని తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి. జ్యోతి, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శారద, రజిత, జ్యోతి, స్వప్న, శివలీల, స్వప్న, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు, నాయకులు సిపెల్లి రవీందర్, అంజయ్య, వనజ, అశోక్, ప్రశాంత్, వెంకటస్వామి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### 108 వాహనాలకు సుస్తీ..
- రెండు నెలలుగా షెడ్‌కే పరిమితమైన వైనం..

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రెండునెలలుగా 108 వాహనాలకు సుస్తి చేసింది. నిత్యం ప్రమాదాలు జరిగే రామగుండం ప్రాంతంలో రెండు నెలలుగా 108వాహనం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోదావరిఖని, మంథనికి చెందిన రెండు వాహనాలు షెడ్డుకు వెళ్లి రెండు నెలలు అయినా ఇప్పటివరకు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ప్రమాదాలు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు రాత్రివేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఎన్‌టీపీసీలో రోడ్డు ప్రమాదం జరుగగా ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఎన్‌టీపీసీ ఎస్పై గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి ఆటోలో తరలించారు. పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖనిలో రెండు 108 వాహనాలు ఉండాల్సి ఉండగా ఒక్కటి కూడా లేకపోవడంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగే రాజీవ్ రహదారిపై ఎవరైనా ప్రమాదంలో గాయపడితే వారిని ఆటోలో తీసుకెళ్లాల్సి వస్తోంది. కొన్ని సమయాల్లో ఆటోల్లో గాయపడిన బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే భయపడుతున్నారు. గోదావరిఖని, మంథని 108వాహనాలు రెండు నెలలుగా షెడ్డుకే పరిమితమైనా వాటి మరమ్మతులు చేయడానికి అధికారులు దృష్టి సారించడం లేదు. బసంత్‌నగర్‌లో ఉన్న 108వాహనమే బసంత్‌నగర్ నుంచి మంథని వరకు వెళ్లాల్సి వస్తోంది.అప్పటివరకు ప్రమాదంలో గాయపడిన వారి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతోంది. ఇప్పటికైనా గోదావరిఖనికి రెండు 108 అంబులెన్స్‌లు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

### టీబీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : టీబీ రహిత సమాజం నిర్మాణానికి కృషి చేయాలని కేంద్ర ప్రతినిధి డబ్ల్యూహెచ్‌వో డాక్టర్ విష్ణు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నిక్షయ్ శివిర్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి మండలం రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చందపల్లి, మేరపల్లి గ్రామాల్లో మంగళవారం సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ విష్ణు మాట్లాడుతూ దేశంలో టీబీని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు కేంద్రప్రభుత్వం తెలంగాణలో 9జిల్లాల్లో పైలట్ కార్యక్రమం కింద నిక్షయ్ శివిర్ 100 రోజుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. జిల్లాలో మేరపల్లిలో అనుమానితులను పరీక్షించారు. టీబీ లక్షణాలు గుర్తిస్తే నేరుగా వాహనాల్లో వారిని ఆసుపత్రికి తరలించి మరిన్ని వైద్య పరీక్షల అనంతరం అవసరమున్న వారికి మందులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కెవి. సుధాకర్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్, టీబీ యూనిట్ సీనియర్ చికిత్స పర్యవేక్షకులు డి. తిరుపతి, ఎంఎల్ హెచ్‌సీలు దైవ కృప, డాక్టర్ సౌమ్య, లక్ష్మి, జోష్న, ఆశా కార్యకర్తలు రజిత, లత, శోభ తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్‌నగర్ పీహెచ్‌సీ సబ్ సెంటర్ రాణాపూర్ గ్రామం శాలపల్లిలో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ నిర్వహించిన 100 రోజుల నిక్షయ్ శివిర్ టీబీ కార్యక్రమానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ బృందం సభ్యులు డాక్టర్ విష్ణు, డాక్టర్ బ్లెస్సి, జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్‌లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిత భవాని, సూపర్‌వైజర్ దేహంజలి, టీబి సూపర్‌వైజర్ గోకృష్ణ, ల్యాబ్ టెక్నీషన్ సిద్ద మధు, ఏఎన్ఎంలు కనకలక్ష్మి, లలిత, వనిత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను మెరుగ్గా నిర్వహించాలి
- పోషక లోపంగల పిల్లలకు బాలామృతం ప్లస్ సరఫరా చేయాలి - కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను మరింత మెరుగ్గా నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్‌లో మహిళా శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ పనితీరుపై అధికారులతో సమీక్షించారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, సేవలు లబ్ధిదారుల వివరాలు, ప్రీస్కూల్ నిర్వహణ, అనీమియా నివారణ మొదలగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. నెలలో ఎన్ని అంగన్వాడీ సెంటర్లను తనిఖీ చేశారు. అక్కడ గమనించిన పరిస్థితులు మొదలగు వివరాలను సూపర్‌వైజర్లను ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ మరింత మెరుగుకావాల్సిన అవసరం ఉందని, పిల్లలకు యూనిఫామ్ ఎక్కడా కనపడలేదని, అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించడం లేదని, కేంద్రాల నిర్వహణ శుభ్రంగా లేదని, ఈ పరిస్థితుల్లో వెంటనే మార్పులు రావాలని సూపర్‌వైజర్‌లకు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను సకాలంలో ఓపెన్ చేయాలని, పిల్లలకు యూనిఫామ్ పంపిణీ చేయాలని, పిల్లలు శుభ్రంగా ఉండాలని, బురద, చెత్తలో ఆడుకుంటున్నట్లు పిల్లలను గమనిస్తే టీచర్ల నుంచి సూపర్‌వైజర్, సీడీపీవో వరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామ్, మాల్ న్యూట్రిషన్ సంబంధించి వాస్తవిక పరిస్థితులు రిపోర్ట్ చేయాలని, ఎంత ఎక్కువ మంది గుర్తిస్తే అంత మంచిదని తెలిపారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటున్నారో లేదా, ఐరన్ మాత్రలు వేసుకుంటున్నారా అనే అంశంపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని, గర్భిణులకు సంబంధించి ప్రతిఅంశాన్ని ట్రాక్ చేసుకునేలా అంగన్‌వాడీ కేంద్రాల వద్ద వ్యవస్థ ఏర్పాటు చేయాలని, గర్భిణుల ఏఎన్సీ రిజిస్ట్రేషన్, చెక్ అప్ సకాలంలో జరిగేలా చూడాలని సూచించారు. ప్రీ స్కూల్లో పిల్లల అటెండెన్స్ తగ్గకుండా చూసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలను రెగ్యులర్‌గా పరీక్షించాలని, పిల్లలకు యూనిఫామ్ సరిగ్గా ఉండాలని, ప్రతి సూపర్‌వైజర్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించాలని, అనవసరమైన ధర్నాలకు ఆస్కారం ఇవ్వవద్దని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలను వంద శాతం మానిటరింగ్ చేయాలని, పోషణ లోపంతో బాధపడే పిల్లలను గుర్తించి వారికి బాలామృతం ప్లస్ సరఫరా అయ్యే విధంగా చూడాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్లు, బాలామృతంప్లస్‌కు లోటు రాకుండా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో గుడ్లు, బాలామృతం ప్లస్‌కు లోటు రాకుండా చూసుకోవాలని అన్నారు. పోషణ లోపంతో ఎత్తు తక్కువ, బరువు తక్కువగల పిల్లలను గుర్తించాలని, వారి కోసం నిర్దేశించిన సూపర్వైజడ్ సప్లిమెంట్ ఫీడింగ్ ప్రోగ్రాం సంబంధించిన వీడియోలు గ్రూపులలో షేర్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ పంచాయతీరాజ్ గిరిష్‌బాబు, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్‌రావు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

### విపత్తు నివారణపై అవగాహన

మంథని, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంజపడుగు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రకృతి వైపరీత్యాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఎన్డీఆర్ఎఫ్ అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. దెబ్బలు తాకిన సమయాల్లో రక్తస్రావం కాకుండా కట్లు కట్టుకోవడం, గుండె ఆగిపోకుండా సీపీఆర్ విధానంతో పాటు భూకంపం, వరదలతో ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో దాసరి లక్ష్మి, ఎన్డీఆర్ఎఫ్ టీం లీడర్ బిశ్వాస్, ఉపాధ్యాయులు కర్రు సురేష్, సంగీత, రవి, స్వామి, సమ్మయ్య, భూమయ్య, నరేందర్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

### నియామకం



చంద్రకాంత్

కోల్‌సిటీటౌన్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా జిల్లా సంయుక కార్యదర్శిగా గోదావరిఖనికి చెందిన చందా చంద్రకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షులు చెన్నుపాటి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు కొండల రాజేందర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

### ఉచిత కుట్టు మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ మహిళలు ఉచిత కుట్టు మిషన్ల కోసం ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జే.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ వారు ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా ఉచిత కుట్టు మిషన్లు అందిస్తున్నారని, జిల్లాలో ఉన్న మైనార్టీ మహిళలు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బుద్ధిష్ట్, జైన్స్, పార్సిస్) ఈనెల 31 లోగా gobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకొని ఆ దరఖాస్తు హార్డు కాపీ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో అందించాలని అన్నారు. ఉచిత కుట్టు మిషన్ల కోసం దరఖాస్తుతోపాటు తెల్లరేషన్ కార్డు లేదా ఆహార భద్రత కార్డు లేదా గ్రామీణ ప్రాంతంలో 1,50,000 పట్టణ ప్రాంతాలు రెండు లక్షలకు మించకుండా వార్షికాదాయ ధ్రువీకరణ పత్రం, 18నుంచి 55సంవత్సరాల మధ్య వయసు ఉండాలని పేర్కొన్నారు.తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా టైలరింగ్ కోర్స్ నేర్చుకుని టైలరింగ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని, కుటుంబానికి ఒక కుట్టు మిషన్ మాత్రమే ఇవ్వబడుతుందని, కనీసం 5వ తరగతి విద్యార్హత ఉండాలన్నారు. ఆసక్తి, అర్హతగల మహిళలు ఈనె 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, నిరుద్యోగ నిరుపేద మహిళలు, విడాకులు తీసుకున్న మహిళలు, వితంతువులు అనాథ, ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఉంటుందని జిల్లా ఇన్‌ఛార్జి మైనార్టీ సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### 23 నుంచి ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు

ధర్మారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) :సిద్దిపేటలో ఈనెల 23నుంచి 25 వరకు జరిగే ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులు పెద్దఎత్తున తరలిరావాలని జిల్లా కన్వీనర్ బండి రాజశేకర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఏబీవీపీ 43వ, రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను విద్యార్థులతో కలిసి స్థానిక ప్రైవేట్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభల్లో యూనివర్సిటీల విద్యార్థి నాయకులు, ప్రొఫెసర్లు, మేధావులు హాజరై విద్యారంగంలోని సమస్యలతోపాటు సమస్యలు, పర్యావరణ పరిరక్షణ, డ్రగ్స్ నిర్మూలన తదితర అంశాలపై తీర్మాణాలు చేస్తారన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఆకుల వంశీ, సంతోష్, అరవింద్, వరుణ్, నితిన్, విద్యార్థులు పాల్గొన్నారు.

### 27 నుంచి కళానాయకుల కవాతు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కళానాయకుల కవాతు ఈనెల 27 నుంచి జరుగుతుందని, అందులో మాదిగలంతా పాల్గొని విజయవంతం చేయాలని ప్రజా గాయకుడు రామంచ భరత్ పిలుపునిచ్చారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ పోరాడుతున్నారని, ఆయన చేపట్టనున్న కవాతుకు మద్దతుగా మాదిగలంతా సహకరించాలని కోరారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలు వర్గీకరణకు మద్దతు తెలిపారన్నారు. ఎస్సీలలో ఉన్న 59 కులాల్లో కేవలం ఒక కులం మాత్రమే వ్యతిరేకంగా ఉందన్నారు. కళానాయకుల కవాతు కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ సూర్యాపేట జిల్లాకేంద్రంలో ప్రారంభించనున్నారని తెలిపారు. సమావేశంలో ఎమ్మెస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి, నాయకులు గుండా థామస్, మహా ప్రదర్శన రాష్ట్ర కోఆర్డినేటర్ ముక్కెర సంపత్ కుమార్, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు మంథని చందు, అంబాల రాజేందర్, వడ్డేపల్లి బాలన్న, మడిపల్లి దశరథం, కన్నూరి అంజు, ఏట రవన్న, గాజుల రమేష్, అగ్గిమల్ల కొమురయ్య, తూండ్ల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ వర్గీకరణపై వినతుల స్వీకరణ

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయంలో ఈనెల 18న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్సీ వర్గీకరణ కమిషన్ వినతుల స్వీకరిస్తున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి యం నాగలైశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ బుధవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లో కమిషన్ ఛైర్మన్ జస్టిస్ డాక్టర్ షమీం అక్బర్ షెడ్యూల్డ్ కులాల ప్రతినిధుల నుంచి ఎస్సీ వర్గీకరణపై వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. వర్గీకరణపై జరిగే బహిరంగ విచారణ కార్యక్రమానికి ఆసక్తిగల వారు అభిప్రాయాలు తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు.

## నర్సింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్, నర్సింగ్ సిబ్బంది

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి శారదానగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మెడకల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ హాజరై కేక్‌కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అరుణ, పాస్టర్ దేవేందర్, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయ, మేరి, బ్లెస్సీ, మేరిలున్నారు.

### ఖని సెక్రెడ్ హార్ట్‌లో..

● కోల్‌సిటీటౌన్ (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సెక్రెడ్‌హార్ట్ హైస్కూల్‌లో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం తబితా ఆశ్రమ చిన్నారులకు, ఈశ్వర కృప వృద్ధాశ్రమంలోని చిన్నారులు, వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో డీవైజీఎం కిరణ్‌బాబు, పాఠశాల కరస్పాండెంట్ మరియాగోరేటి, ప్రిన్సిపల్ ఆరోగ్యమేరి, టికిలా, ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న, ఆఫీస్ ఇంచార్జీ విజయ, పద్మజ, ఉష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

గంగాధర, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధురానగర్‌కు చెందిన బట్టల వ్యాపారి ఆర్థిక ఇబ్బందులతో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. మధురానగర్‌కు చెందిన ఇప్పలపెల్లి మల్లేశం(53) గ్రామాల్లో బట్టలు విక్రయిస్తుండేవాడు. వ్యాపారం సరిగా నడవక అప్పులు పెరిగాయి. మంగళవారం ఉదయం గంగాధర రైల్వే లైనుపై మల్లేశంను రైలు ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు,భార్య శంకరవ్వ ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి

● ఏడుగురి పట్టివేత ● రూ.10,480, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం

సుల్తానాబాద్, డిసెంబరు 17: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి శివారు ప్రాంతంలో రహస్య పేకాట శిబిరంపై రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం రాత్రి దాడి చేశారు. దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పట్టుకున్నామని, వారి నుంచి పది వేల నాలుగు వందల ఎనభై రూపాయల నగదు, ఏడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వీరిని తదుపరి విచారణ నిమిత్తం సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు వారు వివరించారు.

## తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఎరడపల్లి గ్రామంలో తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పంజాల చంద్రయ్య అనే గీత కార్మికుడు వృత్తిలో భాగంగా మంగళవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కడానికి వెళ్లాడు. తాటిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వైద్య చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

## ద్విచక్రవాహనం చోరీ

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌లోని ఈనెల 12న ఓ దుకాణం ఎదుట ఉంచిన దాసరి అజయ్‌కుమార్‌కు చెందిన ద్విచక్రవాహనం చోరీకి గురైందని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పెరుగుపల్లికి చెందిన అజయకుమార్ ఎల్లారెడ్డిపేటకు వలస వచ్చి భవన నిర్మాణ కార్మికుడిగా కొనసాగుతున్నట్లు తెలిపారు.





వినియోగం లేక మూలన పడ్డ వీణలు

సాధన చేస్తున్న విద్యార్థి

# మూగబోతున్న స్వరాలు

### సంగీత కళాశాలలో సమస్యల తిష్ట

### రెండున్నర దశాబ్దాలుగా లెక్చరర్ల పోస్టులు ఖాళీ

### అరకొరగా వసతులు.. నామమాత్రంగా ప్రవేశాలు

### మంథని ప్రభుత్వ సంగీత కళాశాల దుస్థితి

మంథని, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆసక్తి, అభిలాష కలిగిన యవతను సంగీత విద్యాంసులుగా తీర్చిదిద్దాల్సిన మంథని సంగీత కళాశాలలో సమస్యలు తిష్ట వేశాయి.. సంగీతాన్ని బోధించే గురువులు లేక వాయిద్యాలన్నీ దశాబ్దాలుగా గదుల్లోనే బందీలవుతున్నాయి. మంథనిలోని సంగీత కళాశాల నిర్వహణకు ఆశించిన స్థాయిలో ప్రోత్సాహం అందడం లేదు. గత ప్రభుత్వాలు, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా నిత్యం సప్తస్వరాలతో కళకళలాడాల్సిన మంథని సంగీత కళాశాల కళావిహీనంగా దర్శనమిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న ఏకైక ప్రభుత్వ సంగీత కళాశాల నిర్వాహణను రెండున్నర దశాబ్దాలుగా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. హైదరాబాద్‌లో మూడు, వరంగల్, నిజామాబాద్, మంథనిలో ఒక్కొటి చొప్పున తెలంగాణ రాష్ట్రంలో కేవలం ఆరు మాత్రమే ప్రభుత్వ సంగీత కళాశాలున్నాయి.



సాధన చేస్తున్న విద్యార్థులు

### గతమెంతో ఘనం..

వేద విద్యకు నిలయమైన మంథనిలో మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు ప్రత్యేక చొరవతో 1992లో ప్రభుత్వ సంగీత కళాశాలను మంజూరుచేయించి స్వయంగా ప్రారంభించారు. కళాశాలలో హిందూస్థానీ, కర్నాటక ఓకల్, సితార, వీణా, వాయిలిన్, మృదంగం, కూచిపూడి విభాగాల్లో కోర్సులను ప్రారంభించారు. ఆయా విభాగాల్లో కోర్సు బోధించడానికి లెక్చరర్లతో పాటు మృదంగం, తబలా, గామక్ విభాగాల్లో మరో సహాయక పోస్టులను మంజూరు చేశారు. రెండు సంవత్సరాల పాటు అన్ని విభాగాల్లో కలిపి దాదాపు 500 మంది అభ్యర్థులు కళాశాలలో విద్యార్థులుగా చేరి సంగీత సాధన ప్రారంభించారు. అయితే మంథని పట్టణ ప్రాంతం కాకపోవడంతో ప్రైవేట్ క్లాసుల ఇన్‌కం లేక సంగీత కళాశాలలో పని చేస్తున్న చాలా మంది లెక్చరర్లు 1994 తర్వాత పైరవీలతో డిప్యూటేషన్‌పై వెళ్లి ఆ తర్వాత బదిలీ చేయించుకున్నారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు సైతం డిప్యూటేషన్‌పై వెళ్లి పోయారు.

### కర్ణాటక ఓకల్, మృదంగం, పేరిణి విభాగాల్లో సాధన..

సంగీత కళాశాలలో ప్రస్తుతం కర్ణాటక గాత్రం, మృదంగం, పేరిణి విభాగాల్లో మాత్రమే కాస్లులు జరుగుతున్నాయి. ఇటీవల ప్రిన్సిపాల్‌గా నియమితులైన శారద కర్ణాటక ఓకల్ విభాగాన్ని ప్రారంభించారు. సర్టిఫికెట్, డిపామా కోర్సుల్లో ఐదుగురి వరకు బోధిస్తూ సాధన చేయిస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతి పైన ఇదే కళాశాల పూర్వ విద్యార్థి జంబోజు రాజేశం మృదంగం విభాగాన్ని దాదాపు 10మంది విద్యార్థులకు బోధిస్తూ సాధన చేయిస్తున్నారు. కాంట్రాక్టు పద్ధతి పైన పేరిణి నృత్యాన్ని కుమార్ 8 మంది విద్యార్థులకు సాధన చేయిస్తున్నారు. అయితే సంగీత కళాశాలలో లెక్చరర్లు లేని కారణంగా అనేక కోర్సులు అందుబాటులో లేకుండా పోయాయి. హిందూస్థానీ ఓకల్, సీతార, వీణా, వాయిలిన్, కూచిపూడి విభాగాల్లో కోర్సుల్లో సాధన పూర్తిగా కనుమరుగైపోయింది.

### ● సొంత భవనం కరువు..



మంథనిలో ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రారంభమై దాదాపు 30 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికి సొంత భవనం లేదు. నాటి నుంచి నేటి వరకు అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయించి సంగీత కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలని సంగీతాభిమానులు కోరుతున్నారు.

### పూర్వ వైభవం తీసుకురావటానికి కృషి..

**శారద, ప్రిన్సిపాల్, సంగీత కళాశాల, మంథని.**



మంథని ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావటానికి కృషి చేస్తాను. ఇటీవలనే ప్రిన్సిపాల్‌గా చార్జి తీసుకున్నాను. త్వరలోనే మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సంస్థ డైరెక్టర్‌లను కలిసి కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచటానికి కూచిపూడి నృత్యం, తబలా, వయోలిన్, వీణ లాంటి కోర్సులు బోధించడానికి లెక్చరర్ల పోస్టులు మంజూరు చేయాలని, సొంత భవనం నిర్మించాలని కోరుతూ వినతిపత్రం అందజేస్తాను. అందరి సహకారంతో కళాశాలను అభివృద్ధి చేయటానికి కృషి చేస్తాను.

### కళాశాల మూతపడవద్దనే పని చేస్తున్నా..

**తాత్కాలిక మృదంగం అధ్యాపకుడు రాజేశం**



మంథనిలో సంగీత కళాశాల మూతపడవద్దనే తాత్కాలికంగా మృదంగం అధ్యాపకుడిగా పనిచేస్తూ విద్యార్థులకు మృదంగం నేర్పిస్తున్నాను. ఇదే కళాశాలలో నేను మృదంగంలో డిగ్రీ కోర్సు పూర్తి చేశాను. మళ్లీ ఇక్కడే విద్యార్థులకు 15 ఏళ్లుగా మృదంగం నేర్పిస్తున్నందుకు ఆనందంగా ఉంది. కళాశాలకు తిరిగి పూర్వ వైభవం తీసుకురావటానికి నావంతు సహకారం అందిస్తా.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

ఎండపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కారు ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఓ గుర్తుతెలియని యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం మండలంలోని సూరారం గ్రామంలో ఏపీ 29 బీఎస్ 4853 నెంబర్ గల కారు బసంత్‌నగర్ నుంచి రాజారాంపల్లి వైపు వస్తున్నది. అదే క్రమంలో కారు ముందు ద్విచక్రవాహనంపై సబ్బులు అమ్ముకునే గుర్తుతెలియని యువకుడు మారేడుపల్లి నుంచి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనాన్ని వెనకనుంచి కారు ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కారు బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ గ్రామానికి చెందిన నీలం అనిల్, అతని భార్య, ఇద్దరు పిల్లలు కారులో ఉన్నారు. పాప చెవికి కూడా గాయమైంది. గాయపడిన గుర్తుతెలియని యువకుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

## ట్రాక్టర్ డ్రైవర్‌కు 18 నెలల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపి ఇద్దరి మృతికి కారణమైన కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన సింగరవేణి కిషన్ అనే ట్రాక్టర్ డ్రైవర్‌కు 18నెలల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత మంగళవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. 12 జనవరి 2014న కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన గడిపల్లి మల్లేశం, తాటకర్ల శంకర్‌పైకి అజాగ్రత్తగా ట్రాక్టర్ నడుపడంతో ఇద్దరూ మృతిచెందారు. ఈ సంఘటనపై అప్పటి ఎస్సై మాలకొండరాయుడు కిషన్‌ను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి 18 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న టుటౌన్ సీఐ ప్రమోద్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని రెండు నెలలుగా మోసాలకు పాల్పడుతున్న అల్లూరు రాజీవ్‌నగర్ తండాకు చెందిన ధరావత్ రాజేష్ నాయక్‌ను అరెస్టు చేసినట్టు గోదావరిఖని టుటౌన్ పోలీసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం రాజేష్ నాయక్ అరెస్టు వివరాలను సీఐ ప్రమోద్‌రావు వెల్లడించారు. అన్నపూర్ణ ఫుడ్స్ కంపెనీలో నెలకు పదివేల రూపాయల జీతం వస్తుందని ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.2600 నుంచి రూ.5200వసూలు చేస్తూ, స్థానిక సదానందం థియేటర్‌ను లీజుకు తీసుకొని అమాయక ప్రజలను మభ్యపెడుతూ మోసం చేస్తున్నట్టు సీఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ జరపగా రాజేష్ నాయక్ బీజేపీ పేరు చెప్పి ప్రభుత్వ స్కీములను ఇప్పిస్తానని ప్రజలను మోసం చేస్తున్నట్టు గుర్తించినట్టు సీఐ పేర్కొన్నారు.

## భార్యను వేధించిన కేసులో 18 నెలల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): భార్యను వేధించిన కేసులో గంభీరావుపేట మండలంలోని సముద్రలింగాపూర్‌కు చెందిన షేక్ నవాజ్‌కు 18నెలల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన అఫ్రిన్‌ను ఆమె భర్త నవాజ్, బంధువులు అదనపు కట్నం తీసుకురావాలని వేధించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన మేజిస్ట్రేట్ నిందితుడికి 18నెలల జైలు శిక్ష, రూ. 3వేల జరిమానా విధించారు.

## హాస్టల్ నుంచి పారిపోయిన బాలుడు

● గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

మెట్‌పల్లిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన నాంపల్లి శ్రీరామన్ (17) అనే బాలుడు పట్టణ శివారులోని ఓ ప్రైవేట్ పాఠశాల హాస్టల్ గేటు దూకి పారిపోయాడు. పోలీసులు పది గంటల్లో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి శ్రీరామన్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం తెల్లవారుజామున హాస్టల్ గేట్ దూకి పారిపోయినట్లు పాఠశాల యాజమాన్యం గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బాలుడి తండ్రి నాంపల్లి లక్ష్మీనర్సయ్య వెంటనే మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి బాలుడి మిస్సింగ్ కేసు నమోదు చేసి మెట్‌పల్లి ఎస్‌ఐతో పాటు పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. సీఐ ఆదేశాలతో పోలీస్‌లు రెండు బృందలుగా ఏర్పడి ఒక బృందం జగిత్యాల వైపు, మరో బృందం నిజామాబాద్ వైపు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడు హాస్టల్ వార్డెన్ ఫోన్‌ను తీసుకెళ్లడంతో సీడీఆర్ టెక్నాలజీని ఉపయోగించి పారిపోయిన బాలుడు పెద్దపల్లి జిల్లా కొలనూర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నట్టు గుర్తించి వెంటనే పోత్కపల్లి పోలీస్‌స్టేషన్ బ్లూ కోల్ట్ కానిస్టేబుల్‌కు సమాచారం అందించి బాలుడిని పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. అబ్బాయి శ్రీరామన్‌ను పది గంటల్లోనే గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ కిరణ్ కుమార్, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అశోక్ కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ అడ్లూరి రాములు అభినందించారు.

## ముమ్మరంగా సూరమ్మ మత్తడి నిర్మాణ పనులు

కథలాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలికోట సూరమ్మ చెరువు మత్తడి నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజ్-2, ఫేజ్-1లో భాగంగా సుమారు ఆరు కోట్ల రూపాయల అంచనాతో పనులు చేపడుతున్నారు. బీవీఆర్‌ఎస్‌ఎల్ కంపెనీ సబ్ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించగా మత్తడి, కొత్త తూము నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. ఇరిగేషన్ అధికారులు కాంట్రాక్టర్‌తో వేగవంతంగా పనులను చేపడుతున్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులతో చర్చలు కొనసాగిస్తున్నారని తెలిసింది. .

## బద్దిపోచమ్మకు బోనం మొక్కులు



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పిల్లపాపలను, పాడిపంటలను చల్లంగా చూడమ్మా అంటూ భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారిని వేడుకున్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జామున అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండి డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలైన్ కిక్కిరిసిపోయింది. భక్తులు నెత్తిన బోనంతో సుమారుగా రెండు గంటలపాటు నిరీక్షించారు. ఆలయంలోకి వెళ్లిన భక్తులు ముందుగా అమ్మవారికి పట్నాలు వేసి ఒడిబియ్యం, నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఇన్‌చార్జి శివసాయి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# జిల్లా విద్యాశాఖాధికారిపై ఆర్జేడీ విచారణ

కరీంనగర్ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా విద్యాశాఖాధికారిపై డీటీఎఫ్, టీపీటీఎఫ్ సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి డీఈవో కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుల పదోన్నతుల్లో జరిగిన అవతవకలపై డీటీఎఫ్, టీపీటీఎఫ్ సంఘాల నాయకులు వి.రాజిరెడ్డి, ఆవాల నరహరి, తూముల తిరుపతి, పి దామోదర్‌రెడ్డి, జె రామచంద్రారెడ్డి, వి బాలయ్యలు ఆర్‌జేడీకి వివరించారు. డీఈవో పుట్టిన తేదీపై, బీఈడీ అర్హతలపై గతంలో వచ్చిన అభియోగాలు, అనవసరపు ఫార్మాట్లు రూపొందించి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై పని భారాన్ని పెంచుతున్నారని ఆర్జేడీకి వివరించినట్లు తెలిసింది. పదోన్నతుల్లో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో వివిధ సబ్జెక్టుల్లో జరిగిన అవకతవకలను ఆర్జేడీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. 317 జీవో అమలులో జరిగిన అవకతవకలను, కొంత మంది ప్రధానోపాధ్యాయులను తరచుగా ఆన్‌డ్యూటీ పేరిట డీఈవో కార్యాలయానికి రప్పిస్తున్నారంటూ డీఈవోపై ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. డీఈవో కార్యాలయంలో లెక్కకు మించి నాన్ టీచింగ్ స్టాఫ్‌ను వివిధ పాఠశాలల నుంచి డిప్యూటేషన్‌పై నియమించడంపై ఫిర్యాదు చేశామన్నారు. డీఈవో ఏ రోజు కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదని, దీనితో ఫైల్స్ క్లియర్ చేయడంలో జాప్యమవుతోందని సంఘ నాయకులు ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



డీఈవో కార్యాలయంలో విచారణ చేపడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

# బంగారం కడిగి ఇస్తామని అపహరణ

కోరుట్ల రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పాత్రలకు పూతలు వేసి.. బంగారం కడిగి ఇస్తామని మహిళను మోసం చేసి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించిన సంఘటన మండలంలోని నాగులపేట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు పాత్రలకు పూతలు పెట్టి, బంగారం కడిగి ఇస్తామంటూ గ్రామంలో సంచరిస్తూ గ్రామ పంచాయతీ సమీపంలోని బాధితురాలు నక్క జమున ఇంటికి వెళ్లారు. జమునతో ఇంట్లోని బోళ్లను పూత పెడుతామని.. బంగారం కడిగి ఇస్తామని తెలపడంతో ఇంట్లో ఉన్న బోళ్లను బాధితురాలు గుర్తు తెలియని వ్యక్తులకు అందించింది. దీంతో వారు బోళ్లను శుభ్రం చేస్తూ తన మెడలో ఉన్న బంగారం కడిగి ఇస్తామని నమ్మించారు. వెంటనే ఆమె మెడలో ఉన్న పుస్తెల తాడుతో పాటు మరో బంగారు ఆభరణాన్ని గుర్తుతెలియని వ్యక్తులకు అందించింది. దీంతో వారు బంగారం శుభ్రం చేశామని నకిలీ ఆభరణాన్ని జమునకు అందించి ఇంట్లో ఉన్న పసుపులో పెట్టుకొని అరగంట తరువాత తీసుకోవాలని సూచించి అక్కడి నుంచి వారు జారుకున్నారు. అరగంట అయిన తర్వాత పసుపులో పెట్టిన బంగారం చూడగా అది బంగారం కాదని తెలుసుకుని లబోదిబోమంది. చుట్టు పక్కల వారికి విషయం తెలపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్రామంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. బాధితురాలు సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



నకిలీ పుస్తెల తాడు



బాధితురాలు నక్క జమున

# క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ధర్మారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అంతర విశ్వవిద్యాలయాల స్థాయి వాలీబాల్ పోటీలకు ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన గుర్రాల ఆకాష్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తమ్మనవేణి కుమార్ తెలిపారు. ఈనెల 18 నుంచి 22వరకు కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీల్లో శాతవాహన యూనివర్సిటీ తరఫున ఆకాష్ ఆడనున్నారు. ఆకాష్ వివేకనంద డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆకాష్‌ను ఏఎంసీ చైర్మన్ రూప్లానాయక్, వైస్ చైర్మన్ లింగయ్య, పాక్స్ వైస్ చైర్మన్ సామంతుల రాజమల్లు, మాజీ సర్పంచ్ జానకీ శంకర్, తదితరులు అభినందించారు.



గుర్రాల అకాష్

### రాష్ట్రస్థాయి సీఎం కప్ కోకో పోటీలకు ఎంపికైన విద్యార్థిని

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మనగర్ గ్రామం ఎల్ఎండి కాలనీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని కే. సంధ్య రాష్ట్ర స్థాయి సీఎం కప్‌లో కోకో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తెలిపారు. జిల్లా స్థాయి కోకోలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని సంధ్యను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, పిడి.బన్సిలాల్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థిని సంధ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## పంప్‌హౌస్ ప్రాంతంలో పులి సంచార వదంతులు

మల్యాల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాంపూర్ శివారులో పులులు సంచరించించాయనే వదంతులు ఈ ప్రాంతవాసులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇక్కడికి సమీపంలో రాంపూర్, ఓబులాపూర్, గొర్రెగుండం అటవీ ప్రాంతం ఉండడం, మేడిపల్లి మండలం కాసారం వరకు అడవి విస్తరించి ఉంది. కొన్నాళ్ల క్రితం కాసారం వైపు వెళ్లే మార్గంలో గల గుట్టల్లో పులి కనిపించిదని వదంతులు వ్యాపించాయి. తాజాగా మంగళవారం వేకువజామున రాంపూర్ పంప్‌హౌస్ సమీపంలో మూడు పెద్ద పులులు కనిపించాయని కొందరు సోషల్‌మీడియాలో వదంతులు వ్యాపింపచేశారని రాంపూర్‌వాసులు తెలిపారు. ఈ విషయమై గ్రామస్థులు అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కొన్నిరోజులుగా సోషల్‌మీడియాలో పులులు సంచార వదంతులతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై బీట్ అధికారి వసీంను సంప్రదించగా పులి సంచార వదంతులను ప్రజలు వాటిని నమ్మవద్దని సూచించారు.

## గంజాయి మొక్కలు పట్టివేత

ముత్తారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో ఓ వ్యక్తి ఇంటి ఆవరణలో పెంచుతున్న గంజాయి మొక్కలను పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. కాలనీకి చెందిన ఓ వ్యక్తి బంతిపూల మొక్కలతో పాటు ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు నిర్ధారణ చేసుకొని అటవీశాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మంగళవారం సాయంత్రం ఇంటిపై దాడి చేసి మొక్కలను పట్టుకున్నారు. సుమారు 23 మొక్కలు సాగు చేసినట్లు సమాచారం.

## ఇరిగేషన్ అధికారుల విచారణ

కథలాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూలూరు, బొమ్మెన వాగులు ఆక్రమణకు గురవుతున్నాయని కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేయగా ఇరిగేషన్ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. ఇరిగేషన్ డీఈఈ ప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు ఉన్నారు.

## శిలాఫలకం ధ్వంసంపై ఫిర్యాదు

వీర్నపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం భూక్యాతండా పరిధిలోని రాశిగుట్టతండాలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన వంతెన అభివృద్ధి పనుల శిలాఫలకం ధ్వంసంపై వీఆర్ ఏఈ శ్రీనివాస్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ యువకుడు అజాగ్రత్తగా ట్రాక్టర్ నడుపగా శిలాఫలకం ధ్వంసమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్లాగౌడ్ తెలిపారు.

**అసెంబ్లీలో మన నేతలు**

## మిడ్ మానేరులో సీప్లేన్ ఏర్పాటు చేయాలి

● శాసనసభలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రానికి అత్యంత సమీపంలో ఉన్న మిడ్ మానేరు ప్రాజెక్టులో సీ ప్లేన్ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నాడు శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రానికి దూర ప్రాంతాల నుంచి ప్రతినిత్యం భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నారని, వేములవాడకు కేవలం ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న మిడ్ మానేరు ప్రాజెక్టులో సీ ప్లేన్ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక క్షేత్రంగా మరింత అభివృద్ధి చేయవచ్చని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నుంచి శ్రీశైలంకు సీ ప్లేన్ సౌకర్యం ఏర్పాటు చేశారని, అదే తరహాలో మిడ్ మానేరు ప్రాజెక్టులో గానీ, లోయర్ మానేరు ప్రాజెక్టులో గానీ సీప్లేన్ సౌకర్యాన్ని కల్పించే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలని ఆది శ్రీనివాస్ కోరారు. సీ ప్లేన్‌తో పాటు బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను కూడా పరిశీలించాలని తద్వారా ఈ ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా మార్చాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం నాంపల్లిగుట్ట పైకి రోప్ వే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి వదిలేసిందని, రోప్ వే ఏర్పాటుకు గల అవకాశాలను సైతం ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. మిడ్ మానేరులో సీప్లేను, బోటింగ్, నాంపల్లి గుట్ట పైకి రోప్ వే ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతంలో పర్యాటక రంగం మరింత ఊపందుకుంటుందని ఆయన అన్నారు.

### రాజన్న భక్తులకు అదనంగా బస్సులు కేటాయించాలి

వేములవాడ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి నిత్యం సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వస్తుంటారని, భక్తుల సౌకర్యార్థం నూతనంగా డిపోకు అదనపు బస్సులు కేటాయించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అసెంబ్లీలో బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. కోరుట్ల నుంచి వేములవాడకు హైదారాబాద్ నుంచి వచ్చే చివరి బస్సుల సమయాన్ని పెంచాలని సూచించారు. రద్దీకి అనుగునంగా బస్సుల సంఖ్య పెంచుతామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## ధర్మపురిని రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయండి

● అసెంబ్లీలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి నియోజకవర్గానికి భారీ ఎత్తున నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారని, రైతులు 90 శాతం మంది ఆధారపడి ఉన్న ప్రాంతమని ఇక్కడ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం ఆయన ధర్మపురి రెవెన్యూ డివిజన్ ఆవశ్యకత గురించి ఆయన ప్రస్తావించారు. గతంలో ఈ ప్రాంత ప్రజల కోరిక గురించి ప్రభుత్వంలో ఉన్న పెద్దల దృష్టికి తీసుకెళ్లామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో పలుమార్లు ప్రజలు ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేయగా ప్రతి ప్రక్షంలో ఉన్న తాము కూడా ధర్నాలో పాల్గొన్నామని ఆయన తెలిపారు. ధర్మపురి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేందుకు అన్నివిధాల అవకాశం ఉందని తెలిపారు. సంబంధిత మంత్రి వెంటనే ఇక్కడ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని అసెంబ్లీ స్పీకర్ ద్వారా ఆయన విజ్ఞప్తి చేశారు.



● కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన ఒక యువకుడి మొబైల్‌ఫోన్‌కు గుజరాత్‌కు చెందిన అహ్మద్‌ఖాన్ అనే సైబర్ నేరగాడు మెస్సేజ్, ఫైగోల్డ్ పేరిట యూట్యూబ్ లింక్‌లను పంపించాడు. బంగారం, ఎక్స్‌ఆర్‌పీ సంస్థలో పెట్టుబడులు పెడితే త్వరగా రెట్టింపు అవుతుందని నమ్మబలికాడు. వీటిని నమ్మిన ఆ యువకుడు ఆ లింక్‌తో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అతని బ్యాంక్ ఖాతా నుంచి పలు మార్లు 33.63 లక్షల రూపాయలు సైబర్ నేరస్థుడు పంపించిన ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనుమానం వచ్చి ఆ ఖాతా లను పరిశాలించగా ఫేక్ ఖాతాలుగా నిర్ధరణ అయి కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన సైబర్‌క్రైం పోలీసులు విచారణ చేపట్టేసరికే ఆ ఖాతాల్లోని డబ్బులు విత్‌డ్రా అయ్యాయి.



# ఆలస్యం.. అమృతం.. విషం

● సైబర్ మోసాలపై సత్వరమే స్పందించాలి

● గోల్డెన్ టైంలో ఫిర్యాదు చేస్తే రికవరీకి అవకాశం

కరీంనగర్ క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరం జరిగిన తరువాత సాధ్యమైనంత త్వరగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. ఇలా ఫిర్యాదు చేస్తే ఇతర ఖాతాలకు బదిలీ అయిన డబ్బును హోల్డ్‌లో పెడతారు. విచారణ అనంతరం బాధితులకు డబ్బులు అందజేస్తారు. నేరం జరిగిన తర్వాత స్పందించే సమయాన్ని గోల్డెన్ అవర్ అంటారు. గతంలో గంటలోపు ఉండే సమయం ప్రస్తుతం నిమిషాల్లోకి మారింది. ఆ గోల్డెన్ అవర్ కాస్త గోల్డెన్ టైంగా మారింది. సైబర్ నేరం జరిగిందని గుర్తించిన వెంటనే స్పందించి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

### సైబర్ మోసాలపై ఫిర్యాదుకు 1930 టోల్ ఫ్రీ నంబర్

సైబర్ మోసాలపై ఫిర్యాదుల కోసం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు కలిపి 1930 టోల్‌ఫ్రీం నంబరు ఉంది. ఈ కేసులను ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐసీసీసీసీ) పర్యవేక్షిస్తుంటుంది. దేశంలో ఏ రాష్ట్రం, ఏ ప్రాంతం నుంచి సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబరు 1930కి కాల్ వచ్చినా అక్కడి అధికారులు స్పందించి వివరాలను నమోదు చేసుకుంటారు. 24 గంటలు ఈ టోల్‌ఫ్రీ నంబరు పని చేస్తుంది. ఒక సైబర్ మోసం జరిగినట్లు ఫిర్యాదు రాగానే ఆ బాధితుడు ఇచ్చిన ఖాతా నంబరు ఆధారంగా వెంటనే ఆ ఖాతాను ఫ్రీజ్ చేస్తారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కోర్టులో సమాచారం అందించి, కోర్టు ఆదేశాలతో నేరస్థుడి ఖాతా నుంచి ఆ డబ్బులను బాధితుడి ఖాతాకు జమ చేస్తారు. ఐసీసీసీసీకి దేశంలో అన్ని ప్రైవేట్, ప్రభుత్వ బ్యాంక్‌లు అనుసంధానమై ఉంటాయి. ఆయా బ్యాంక్‌ల నోడల్ ఆఫీసర్లు నిత్యం ఈ సైబర్ కేసులను పరిశీలిస్తూ, వారి బ్యాంక్‌లకు సంబంధించిన కేసు నమోదైతే వెంటనే ఆ ఖాతాలను హోల్డ్‌లో పెడుతారు. బాధితులు మోసం జరిగిన వెంటనే సాధ్యమైనంత వరకు తక్కువ సమయంలో సైబర్ క్రైం టోల్‌ఫ్రీం 1930కు సమాచారం అందించాలి. బాధితుడి పేరు, ఇతర వివరాలతోపాటు తన బ్యాంక్ ఖాతా నంబరు, తేదీ, సమయం, డబ్బులు ట్రాన్స్‌ఫర్‌కు సంబంధించిన ఐడీ, స్ర్కీన్‌షాట్, సైబర్ నేరగాళ్లు పంపించిన లింక్ లేదా మెస్సేజ్ వంటి వివరాలను అందించాలి.



కరీంనగర్ సైబర్ క్రైం పోలీసు రాణా




● ఇటీవల ఉమ్మడి జిల్లాకు చెందిన ఒక ఉద్యోగి సైబర్ కేటుగాళ్ల వలకు చిక్కి లక్ష రూపాయలు గుర్తుతెలియని ఖాతాకు పంపించాడు. మోసానికి గురయ్యానని తెలుసుకున్న వెంటనే నిమిషాల వ్యవధిలో సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబరు 1930కి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేశాడు. వెంటనే సైబర్ క్రైం పోలీసులు రంగంలోకి దిగి డబ్బులు జమ అయిన ఖాతాను హోల్డ్‌లో పెట్టి బాధితుడికి న్యాయం చేశారు.

● కరీంనగర్‌కు చెందిన ఓ యువకుడి టెలిగ్రాం అకౌంట్‌కి క్రిప్టో కరెన్సీకి సంబంధించిన ఒక ప్రొఫైల్ వచ్చింది. దీనిని ఓపెన్ చేయగా డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే తక్కువ సమయంలో రెట్టింపుకావటంతోపాటు మరి కొన్ని బహుమతులు గెలుచుకునే అవకాశముందని రాజస్థాన్‌కు చెందిన సైబర్ నేరగాడు నమ్మబలికాడు. దీంతో ఆ యువకుడు 1.6 లక్షల రూపాయలు ఫోన్‌పే ద్వారా నేరస్థుడి ఖాతాకు పంపిం చాడు. ఆ తరువాత ఫోన్ స్విఛాప్ రావటంతో మోసపోయానని బాధితుడు సైబర్ క్రైం పోలీసులను



ఆశ్రయించాడు. అప్పటికే నిందితుడు తన ఖాతాలోని డబ్బులను విత్‌డ్రా చేశాడు.

### ఏపీకే లింక్‌లు ఓపెన్ చేయొద్దు..

**వరాల నర్సింహారెడ్డి, కరీంనగర్ సైబర్‌క్రైం డీఎస్పీ**



మొబైల్‌ఫోన్‌కు వచ్చే గుర్తుతెలియని ఏపీకే లింక్‌లను తెరవొద్దు. క్రెడిట్‌కార్డు, డెబిట్‌కార్డు పిన్ నంబర్లు ఎవరికీ చెప్పొద్దు. సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌లను మాత్ర మే ఉపయోగించాలి. కొత్త నంబర్ల నుంచి వచ్చే వీడియో కాల్స్, వాట్సప్ కాల్స్ రిసీవ్ చేసుకోవద్దు. మోసాలబారిన పడకముందే సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి వివరాలు అందించాలి. గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయడం వల్ల నేరస్థుల ఖాతాలను ఫ్రీజ్ చేసి, పోయిన డబ్బులు తిరిగి రాబట్టేందుకు అవకాశం ఉంటుంది.

### 20న జాబ్ మేళా

గణేశ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హైదరాబాద్‌లోని మెడ్‌ప్లస్‌లో ఉద్యోగాలు కల్పనకు ఈనెల 20న కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డ ఫైర్‌స్టేషన్ దగ్గర ప్రభుత్వ ఈ-ఆధార్ సేవ కేంద్రం పై అంతస్తులో గల జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడ్‌ప్లస్ సంస్థలో 20ఫార్మసిస్ట్, 30సేల్స్ అసోసియేట్, 50 జూనియర్ అసిస్టెంట్, 15 ఆడిట్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. సేల్స్ ఫార్మసిస్ట్ పోస్టులకు డిప్లొమా/డిగ్రీ ఇన్ ఫార్మసీ, జూనియర్ అసిస్టెంట్, కస్టమర్ సేల్స్ అసోసియేట్, ఆడిట్ అసిస్టెంట్లకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు డిసెంబర్ 20న ఉదయం 11 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయానికి వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9392310323, 7207659969, 9908230384 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

### ఎస్‌యూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరి డీబార్

గణేశ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల పెద్దపల్లిలో ఒకరు, గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు డీబార్ అయినట్లు పేర్కొన్నారు.

### జమ్మికుంటలో ఆరగంట ఆలస్యంగా డిగ్రీ పరీక్ష

జమ్మికుంట, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు జరుగుతున్న ఐదవ సెమిస్టర్ ఇంగ్లీష్ పరీక్ష మంగళవారం ఆరగంట ఆలస్యంగా జరిగింది. ఉదయం 9గంటలకు పరీక్ష ప్రారంభం కావాల్సి ఉండగా, సరిగ్గా ప్రశ్నాపత్రం ఇచ్చే సమయానికి కరెంట్ పోయింది. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. 8.50గంటలకు ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రం ప్రింట్ తీసి విద్యార్థులకు ఇవ్వాల్సి ఉంది. కరెంట్ పోవడంతో అధ్యాపకులు హైరానా పడ్డారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్ హుటాహుటిన జనరేటర్ తెప్పించి ఆన్‌లైన్‌లో ప్రశ్నాపత్రాలు ప్రింట్ తీసి విద్యార్థులకు ఇచ్చారు. అప్పటికి ఆరంగంట గడిచిపోయింది. యూనివర్సిటీకి సమాచారం అందించడంతో అదనంగా మరో ఆరగంట సమయం కేటాయించడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

### నర్సరీలపై సమావేశం

సైదాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నర్సరీలపై రివ్యూ సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణ నర్సరీలపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

### రూ.7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,150 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 21మంది రైతులు 169క్వింటాళ్ల విడి పత్తి, ముగ్గురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,150, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. అదేవిధంగా 290మంది రైతులు 4510క్వింటాళ్ల పత్తిని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కి మద్దతు ధర ప్రకారం విక్రయించారు.

### మాల కులస్థులపై దుష్ప్రచారం మానుకోవాలి

ఇల్లందకుంట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మాల కులస్థులపై మాదిగలు చేసే దుష్ప్రచారాన్ని మానుకోవాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మాదాసు మొగిలి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు మాలలు ఎన్నడు వ్యతిరేకం కాదని, వర్గీకరణతో పాటు క్రిమిలేయర్ వ్యవస్థను తీసుకువస్తారని తెలిపారు. క్రిమిలేయర్ వ్యవస్థ ద్వారా రాబోయేరోజుల్లో ముందు తరాలకు అన్యాయం జరుగుతుందన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, కనుమల్ల రామకృష్ణ, బోగం చిరంజీవి ఉన్నారు.

## కోడెల పంపిణీకి అనుమతి తప్పనిసరి

● ప్రతి రోజూ కోడెల వివరాలు రిపోర్ట్ చేయాలి ● కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ● వేములవాడ ఆలయ గోశాల నిర్వహణపై సమీక్ష

సిరిసిల్ల కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజన్న దేవాలయం గోశాలకు సంబంధించిన కోడెల పంపిణీకి కలెక్టర్ అనుమతి తప్పనిసరని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో వేములవాడ ఆలయ గోశాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన అనుమతి లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ గోవులను పంపిణీ చేసేందుకు వీలులేదన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 1975 కోడెలు, ఆవులను గోశాల నుంచి పంపిణీ చేశామని, వీటిలో మొదటి దశలో 1278 కోడెలు, 75 ఆవులు, రెండో దశలో 389 కోడెలు, 45 ఆవులు, మూడో దశలో 188 కొడెలు పంపిణీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మొదటి, రెండు దశలకు మాత్రమే కలెక్టర్ అనుమతి తీసుకున్నారని, మూడో దశ మాత్రం అనుమతి లేకుండా ఎలా పంపిణీ చేశారని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ప్రశ్నించారు. మూడో దశ పంపిణీకి గల కారణాలపై సమగ్ర నివేదిక అందించాలని, దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. వచ్చే శుక్రవారం నాటికి జిల్లాలో పంపిణీ చేసిన 1975 కోడెలు, ఆవుల స్థితి గతులపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పంపిణీ చేసే సమయంలో వాటికి ట్యాగ్ ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయం పోలీస్ సిబ్బంది విచారించి ఎంపిక చేసే వరకు ఏ లబ్ధిదారుడికీ గోశాల నుంచి కోడెలు, ఆవులను ఇతర జిల్లాలకు పంపిణీ చేసేందుకు వీలు లేదన్నారు. ప్రతీ రోజు వేములవాడలోని 2 గోశాలలు, ఆలయ ఆవరణలో కోడెలు, ఆవుల వివరాలు తెలియ జేయాలన్నారు. లబ్ధిదారుల జాబితాపై కలెక్టర్ సంతకం లేనంత వరకు అది ఫైనల్ కాదని స్పష్టం చేశారు. వేములవాడ ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతీ వారం సమీక్ష సమావేశం ఉంటుందని, నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులు జరగాలని అన్నారు. ఎక్కడా అవకతవకలు ఉండడానికి వీలులేదని, ఆలయానికి సంబంధించిన ప్రతీ అంశం తన దృష్టికి రావాలని అన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, వేములవాడ ఆలయ ఇన్‌చార్జి ఈవో రాజేష్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, డీపీఆర్వో శ్రీధర్, వేములవాడ తహసీల్దార్ మహేష్ ఉన్నారు.

## కబేళాలకు కోడెల తరలింపుపై భక్తుల ఆవేదన

● బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి



వేములవాడలో శాంతిహోమంలో పాల్గొన్న ఏనుగుల రాకేష్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాజన్న కోడెలను కబేళాలకు తరలించడంపై భక్తులు ఆవేదన చెందుతున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. రాజన్న కోడెలను గీసుకొండలో కబేళాలకు తరించడంపై వేములవాడ పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం స్థానిక బీఆర్‌ఎస్ నేతలతో కలిసి శాంతిహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కాదని, కాసుల సురేఖ అని మహాశివుడి శాపానికి గురికాక తప్పదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బు సంపాదించడమే లక్ష్యంగా మంత్రి కొండా సురేఖ అనుచరులు రాజరాజేశ్వరస్వామి కోడెలను కబేళాలకు తరలిస్తున్నారన్నారు. కోడెల ఆత్మశాంతి కోసం శాస్త్రీయత ప్రకారం శాంతి హోమం నిర్వహించామన్నారు. నిజకోడెను స్వామివారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నట్లు వివరించారు. ఏ పార్టీ ముఖ్యమంత్రి అయినా ఆలయాల విశిష్టతను కాపాడేందుకు కృషి చేస్తారన్నారు. రాజన్నకు కోడె చెల్లించుకుంటే పరమేశ్వరునికి చెందుతుందని, భక్తులు విశ్వసించేవారని, ఇప్పుడు కోడె చెల్లించుకుంటే మంత్రి షెడ్డులోకి పోతున్నాయని పలువురు మాట్లాడుకుంటున్నారని అన్నారు. ఓరుగల్లు పేరును కాపాడాల్సిన మంత్రి అనుచరుల చేత కోడెలను కబేళాలకు తరలించడం ఏమిటని ప్రశ్నించారు. కాశీకి పోయినా, గంగాలో మునిగినా ఈ పాపం పోదన్నారు. కాసుల కోసం కోడెలను అమ్మిన కసాయి సురేఖ అని ఘాటు విమర్శలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేసి తప్పినందుకే ములుగులో భూమి కంపించిందని, చెట్లు నేలమట్టమయ్యాయని అన్నారు. రాజన్న కోడెలను కబేళాలకు తరలించిన ఘటనపై సిట్టింగ్ జడ్జీతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, నాయకులు నిమ్మశెట్టి విజయ్ తదితరులు ఉన్నారు.

## అంకాపూర్, ములుకనూర్‌లకు దీటుగా లక్ష్మీపూర్

● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

జగిత్యాలరూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఆదర్శగ్రామాలుగా ఉన్న అంకాపూర్, ములుకనూర్లకు దీటుగా లక్ష్మీపూర్ నిలుస్తుందని, రైతులు సంఘంగా ఏర్పడి ముందుకు సాగుతున్న తీరు ప్రశంసనీయమని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఏడీఏ అశోక్‌కుమార్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడారు. లక్ష్మీపూర్ రైతులు తాము పండించిన ఉత్పత్తులను ఆహార ఉత్పత్తులుగా మార్చేందుకు ఫుడ్ ప్రాసెసింగ్, ఇండస్ట్రీస్ వైపు దృష్టిసారించడమేకాకుండా, సేంద్రియ వ్యవసాయంవైపు మళ్లాలని సూచించారు. ఆహార ఉత్పత్తులను బయటిదేశాలకు ఎగుమతి చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపూర్ సహకారసంఘం చైర్మన్ పన్నాల తిరుపతిరెడ్డి, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ప్రతినిధి రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీపూర్ రైతు ఉత్పత్తిదారుల సంఘం వద్ద రైతులతో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

## బస్సు సౌకర్యం లేక మోడల్ స్కూల్ విద్యార్థుల ఇబ్బందులు

కొడిమ్యాల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సు ఏడాది కాలంగా రాకపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పలువురు విద్యార్థులు గ్రామాల నుంచి అటో, వ్యాన్లలో పాఠశాలకు వస్తున్నారు. దీని కోసం ఒక్కొక్కరు నెలకు 1,000 రూపాయల నుంచి 1,500 రూపాయల వరకు చెల్లిస్తున్నట్లు పలువురు విద్యార్థులు తెలిపారు. మండలంలోని నల్లగొండ, తిప్పయ్యపల్లి, చెప్యాల, పూడూర్, నాచుపల్లి తదితర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు కొడిమ్యాల బస్టాండ్‌లో దిగి సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న మోడల్ స్కూల్‌కు నడిచి రావటం ఇబ్బందిగా తయారైందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మండల ప్రత్యేక అధికారిని కలిసి ఆర్టీసీ బస్సును మోడల్ స్కూల్ వరకు నడిపించాలని విద్యార్థులు కోరారు. గతంలో వేములవాడ నుంచి మోడల్ స్కూల్ వరకు నడిచిన ఆర్టీసీ బస్సు ఏడాదిగా నిలిచిపోవటంతో విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సు రాకపోవటంతో గత సంవత్సరం 393 మంది విద్యార్థులు ఉన్న సంఖ్య ప్రస్తుత్తం 295 మందికి తగ్గింది.

● పాఠశాల మైదానంలో బండరాళ్లు..

మోడల్ స్కూల్ మైదానంలో పెద్ద రాళ్లు ఉండటంతో క్రీడలకు ఆటంకంగా మారాయి. అంతే కాకుండా పాఠశాల మైదానంపై తక్కువ ఎత్తులో విద్యుత్ వైర్లు ఉండటం వాలీ బాల్ ఆడుతున్న సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు పలువురు విద్యార్థులు తెలిపారు. మైదానంలోని రాళ్లను తొలగించి, విద్యుత్ వైర్లను మార్చాలని వారు కోరుతున్నారు. విద్యార్థుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మోడల్ స్కూల్ వరకు ఆర్టీ బస్సు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



బ్యాగులతో నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు



బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్న మోడల్‌స్కూల్ విద్యార్థులు

### మోడల్ స్కూల్ వరకు బస్సును నడుపాలి

**- లావణ్య, ప్రిన్సిపాల్**



కొడిమ్యాల మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సును అధికారులు నడిపించాలి. సుమారు రెండు కిలోమీటర్ల దూరం నుంచి విద్యార్థులు నడిచి రాలేకపోవటంతో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఏడాది కాలంగా ఆర్టీసీ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఎవరూ పట్టించుకోవటం లేదు.

## న్యూస్ బాక్స్

### సర్వే చేసి దారి ఇప్పించాలి

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) ఓదెల మండల కేంద్రంలో రేవుల కుంట చెరువు ప్రాంతంలో వ్యవసాయ భూములకు వెళ్లేందుకు రైతులకు దారి ఇప్పించాలని అదే గ్రామానికి చెందిన తాటికొండ రమేష్, తాటికొండ కృష్ణమా చారి, తాటికొండ వెంకటేశ్వర్లు అధికారులను కోరారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రేవులకుంటకు వెళ్లేదారి ఆక్రమణకు గురైందని కలెక్టర్‌కు ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. దారి విషయంపై ఓదెల తహసీల్దారుకు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. దారి ఆక్రమణ వల్ల రైతులు పంటపొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. సర్వేయర్‌తో సర్వే నిర్వహించి సర్వే నెంబరు 943లో భూములకు వెళ్లడానికి దారి ఇప్పించాలని కలెక్టరును కోరారు.

### రంగాపూర్‌లో ఉచిత వైద్య శిబిరానికి స్పందన

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్ గ్రామంలో పెద్దపల్లి ఎంఎంఎస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. వైద్యులు డాక్టర్ మొయిన్ పాష ఆధ్వర్యంలో గ్రామంలో సుమారు 150 మందికి వివిధ రకాలు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, థైరాయిడ్‌తో పాటు పలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రీతి, సానియా, జోగేష్, సుమన్, నాజోఫర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సై ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు భిక్ష

ఓదెల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొత్కపల్లి రాజగోపాలస్వామి, భవాని సహిత మహాలింగేశ్వర స్వామి క్షేత్రాల్లో మంగళవారం ఎస్ఐ అశోక్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప దీక్షాపరులకు భిక్షను నిర్వహించారు. పొత్కపల్లికి చెందిన 25 మంది భక్తులు అయ్యప్ప దీక్ష చేపట్టి 22రోజులు పూర్తయిన సందర్భంగా దీక్ష పరులకు ఎస్ఐ అశోక్‌రెడ్డి సతీమణితో కలిసి పూజలు నిర్వహించి భిక్షను వడ్డించారు. మహాలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు రాజగోపాలస్వామి ఆలయంలో అంతకుముందు పూజ నిర్వహించారు.

### ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలి

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని ఎంఎల్‌సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష అభియాన్‌లో దీక్షలు నిర్వహిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఎంఎల్‌సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయబద్ధమైన డిమాండ్ల కోసం దీక్ష చేస్తున్న వారిని ప్రభుత్వం వెంటనే గుర్తించి నెరవేర్చాలని, ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాక్ అధ్యక్షులు తిప్పని తిరుపతి, ఉద్యోగుల సంఘం రాష్ట్ర ముఖ్య సలహాదారులు కుంబాల సుధాకర్, రాజ్‌కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల సర్వే

రామగిరి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదివారంపేట్, నాగేపల్లి, రత్నాపూర్ గ్రామపంచాయతీల్లో ఇందిరమ్మ గృహలపై మంగళవారం సర్వే చేపట్టారు. ఎంపీడీవో శైలజ రాణి ఆధ్వర్యంలో ఇంటింటా సర్వేను నిర్వహించారు. అనంతరం మండలంలోని పోలింగ్ స్టేషన్ల ఫైనల్ పబ్లికేషన్ చేపట్టారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఎంపీవో ఉమేష్, గ్రామ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# లగచర్ల రైతులపై కేసులు ఎత్తివేయాలి

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



ధర్మారంలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు





పెద్దపల్లి, మంథనిల్లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధు

గోదావరిఖని, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ డిమాండ్ చేశారు. లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు, రైతుల పట్ల వ్యవహరిస్తున్న విధానాలను నిరసిస్తూ, రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక మున్సిపల్ జంక్షన్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి చందర్ వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లగచర్ల బాధితులకు న్యాయం చేయాలని, రైతులపై పెట్టినా కేసులు ఎత్తి వేయాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పీటీసీ ఆముల నారాయణ, కార్పొరేటర్లు కుమ్మరి శ్రీనివాస్, గాధం విజయ, నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్, బొడ్డు రవీందర్, పర్లపల్లి రవి, జిమ్మిబాబు, నూతి తిరుపతి, తోకల రమేష్, సట్టు శ్రీనివాస్, పిల్లి రమేష్, కుడుదుల శ్రీనివాస్, ముద్దసాని సంధ్యారెడ్డి, యాసర్ల తిమోతి, నిట్టూరి రాజు, వడ్లూరి రాములు, వెంకన్న, ఆవునూరి వెంకటేష్, కనకలక్ష్మి, లక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

● పెద్దపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనలో రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి జైళ్లలో నిర్బంధించడాన్ని నిరసిస్తూ మంగళవారం పెద్దపల్లి బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పురాజ్ కుమార్, మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, కౌన్సిలర్లు పెంచాల రమ శ్రీధర్, లైశెట్టి భిక్షపతి, చంద్రశేఖర్, సురేష్‌బాబు, రేవల్లి స్వామి, కోఆప్షన్‌సభ్యుడు ఫహీమ్, రామగిరి చంద్రమౌళి, నాయకులు బెక్కం ప్రశాంత్, ఖదీర్, పెద్ది వెంకటేష్, జావిద్ ఉద్దీన్, వెన్నం రవీందర్, పల్లె మధు, వైద శ్రీనివాస్, గొట్టేముక్కుల శ్రీనివాస్, కుక్క మనోజ్, మొలుగూరి సాగర్, ఖాదర్, వి. శ్రీనివాస్, సలేంద్ర రాములు, ప్రేమ్‌సాగర్, దామ సదయ్య, బొడ్డుపల్లి రాజేశం, నర్ల అంజయ్య, జనగామ సదయ్య పాల్గొన్నారు.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి) : లగచర్ల రైతులపై అక్రమ కేసులకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి వినతీ పత్రం సమర్పించి నిరసన తెలిపింది. కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పూస్కూరి జితేందర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, సామంతుల రాజమల్లయ్య, ఎండీ రఫీ, పాకల రాజయ్య ఎగ్గెల స్వామి, కూరపాటి శ్రీనివాస్, దేవి నళినికాంత్, దేవి వంశీకృష్ణ, అంజయ్య దాడి సదయ్య, కొత్త మోహన్, నాడెం శ్రీనివాస్, ఆజాంబాబా, నారా ప్రేమ్‌సాగర్, సతీష్‌రెడ్డి, గంధం తిరుపతి, దేవి రాజారాం, పుట్ట తిరుపతి, బాణాల నాగరాజు పాల్గొన్నారు.

● మంథని (ఆంధ్రజ్యోతి) : లగచర్ల రైతులపై కేసులను ఉపసంహరించుకోవాలని అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు వినతి పత్రాన్ని అందజేశారు. అన్నం పెట్టే రైతులపై అక్రమంగా కేసులు పెట్టారని, వారిని బేషరతుగా విడుదల చేయాలని, కేసులు ఎత్తివేయాలని కోరుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు వినతిపత్రాన్ని ఇచ్చామన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, మాచీడి రాజుగౌడ్, మిర్యాల ప్రసాద్‌రావు, మంథని సత్యం, ఆరెపల్లి కుమార్, కనవేన శ్రీనివాస్, ఆసీఫ్ పాల్గొన్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న క్రిస్మస్ సామగ్రి

## రామగుండంలో ముందస్తు క్రిస్మస్ సందడి

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో పది రోజుల ముందు నుంచే క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్నారు. పలు పాఠశాలలు, కళాశాలలతో పాటు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. క్రిస్మస్ తాత వేషధారణలో చిన్నారులు ఆకట్టుకుంటున్నారు. 20 రోజుల ముందు నుంచే క్రైస్తవలు తమ ఇండ్లపై స్టార్లను ఏర్పాటు చేసుకున్నారు. క్యారల్స్ నిర్వహిస్తున్నారు. ఈనెల 25న క్రిస్మస్ నేపథ్యంలో పలు దుకాణాలు రద్దీగా మారాయి. షాపుల్లో ఏర్పాటు చేసిన స్టార్స్, క్రిస్మస్ ట్రీ, డెకరేషన్, గిఫ్ట్‌లు, డిస్కో లైట్లకు గిరాకీ పెరిగింది. ఒక్కొక్క స్టార్ రూ.100 నుంచి రూ.1000 ధర పలుకుతుండగా క్రిస్మస్ శాంట్రాక్లాజ్ అమ్మకాలు కూడా పెరిగాయి.

## రెండో ఏఎన్ఎంలను అరెస్టు చేయడం సరికాదు..

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సునిల్

సుల్తానాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సెకండ్ ఏఎన్ఎంలను సుల్తానాబాద్‌లో అక్రమంగా అరెస్టు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ అన్నారు. సుల్తానాబాద్ పీఎస్‌లో అరెస్ట్ అయిన వారిని పరామర్శించిన అనంతరం కడారి సునీల్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సెకండ్ ఏఎన్ఎంలు కరోనా సమయంలో వారి ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశారని అన్నారు. డిసెంబర్ 29న సెకండ్ ఏఎన్ఎంలకు ఎగ్జామ్ ఉంటుందని, ఈ ఎగ్జామ్‌లో 30 శాతం వెయిటేజీ మార్కులు కలపాలని, వయసు రిత్యా ఎగ్జామ్‌కు అర్హత లేని వాళ్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద పది లక్షలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా రెగ్యులర్ అయ్యేదాకా వంద శాతం గ్రాస్ సాలరీ అమలు చేయాలన్నారు. సెకండ్ ఏఎన్ఎంల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని ముఖ్యమంత్రిని కలవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో స్వేచ్ఛగా నిరసన తెలుపుకోవచ్చని చెప్పిన నాయకులు ఇప్పుడు హైదరాబాదులో ఏదైనా కార్యక్రమం ఉందంటే చాలు అక్రమ అరెస్టులు చేయడం విచిత్రంగా ఉందన్నారు.

అరెస్టు అయిన సెకండ్ ఏఎన్ఎంలలో స్వైలాబ్ రాణి, స్వరూప, వీణ, రమ, శారద, రాజుభాయ్, పద్మాంజలి భూలక్ష్మి రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

### గ్రామపంచాయతీ సిబ్బంది అరెస్టు

కమాన్‌పూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ సిబ్బంది హైదరాబాద్‌కు వెళ్తున్నరన్న సమాచారం మేరకు పోలీసులు వారిని ముందస్తుగా అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో మండల అధ్యక్షుడు భూమయ్య, ప్రధాన కార్యదర్శి భీమరాజు, రమేష్, శంకర్, సంతోష్, సాకేత్, విజయేందర్ తదితరులు ఉన్నారు.

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విజ్ఞాన యాత్ర

కోల్‌సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సీఐ జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు మంగళవారం మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం(ఎస్‌టీపీపీ)లో విజ్ఞాన యాత్ర నిర్వహించారు. యాత్రకు సహకరించిన ఎస్‌టీపీపీ జీఎం శ్రీనివాసులుకు జడ్‌పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయురాలు టీ విమల కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుమిద, భవాని, ఉమ, మాధవి, మహబూబ్‌అలీ, ప్రేమ, జ్యోతి పాల్గొన్నారు.

### కొండెక్కిన కోడిగుడ్డు..

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. ఈ బేకరీల యజమానులు ఇప్పటికే కేకుల తయారీ కోసం అడ్వాన్స్‌గా కోడిగుడ్ల కోసం ఆర్డర్లు ఇచ్చారు.

### మధ్యాహ్న భోజన పథకానికి ఇక్కట్లు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్న మహిళలపై, గురుకుల విద్యాలయాలకు కోడిగుడ్లను సరఫరా చేస్తున్న కాంట్రాక్టలపై కోడిగుడ్ల ధరలు పెరగడం వల్ల అదనపు భారం పడుతున్నది. జిల్లాలో 542 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 30 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరికి మధ్యాహ్న భోజన పథకం ద్వారా వారికి 3 కోడిగుడ్లు, నెలకు 12 గుడ్లు పెడుతుంటారు. అంటే నెలకు సగటున 3 లక్షల కోడిగుడ్లు విద్యార్థులకు పెట్టాల్సి ఉంటుంది. ఈ లెక్కన పథకాన్ని అమలుచేసే ఏజెన్సీలకు ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు 5 రూపాయలు చెల్లిస్తున్నది. ధరలు అధికంగా పెరగడంతో ఏజెన్సీలు నెలకు 6లక్షల నుంచి 6.50 లక్షల రూపాయల అదనపు భారాన్ని మోయాల్సి వస్తున్నది. గురుకుల విద్యాలయాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకునే మెస్ చార్జీలను 40 శాతానికి, 200 శాతం వరకు కాస్మెటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. దీంతో పాటు కొత్త మెనూను కూడా అమల్లోకి తీసుకవచ్చింది. ఆ మెనూలో ప్రతి రోజు కోడిగుడ్డు పెట్టాలని పేర్కొన్న దృష్ట్యా కూడా కోడిగుడ్లకు అధికంగా డిమాండ్ ఏర్పడింది. దీనిని ఆసరా జేసుకుని వ్యాపారులు కృత్రిమ కొరతను కూడా సృష్టిస్తున్నారు. గురుకులాల్లో కోడిగుడ్లను 5నుంచి 5.50 రూపాయలకు కోడిగుడ్లను సరఫరా చేసేందుకు పలువురు కాంట్రాక్టు తీసుకున్నారు. పెరిగిన ధరలతో వారిపై కూడా అదనపు భారం పడుతున్నది. ఏటా నవంబర్, డిసెంబర్ మాసాల్లో చికెన్ ధరలు తగ్గి కోడిగుడ్డు ధరలు పెరుగుతుంటాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రెండు మాసాల్లో బహిరంగ మార్కెట్‌లో ఉన్న కోడి గుడ్ల ధరలను చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్న మహిళా సంఘాల మహిళలు, గురుకులాల కాంట్రాక్టర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు గర్రెపల్లి విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సుల్తానాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో గర్రెపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో టి. అక్షిత, డి. ప్రణవి జి. శశిప్రియా బాలుర విభాగంలో డి.ఆదిత్య, వీరబ్రహ్మం పి.ఆదిత్య, రాకేష్, రావణ్ బహుళ, ధనుష్‌లు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరందరూ ఈనెల 28,29,30వ తేదీల్లో మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ కనబరచాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. కవిత, పీడీ ఆసియా, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

### తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయింపు

ముత్తారం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇతర మహిళ మోజులో పడి తన భర్త తనకు తెలియకుండా తమ భూమిని వేరే వారికి పట్టా చేశాడని తండ్రితో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఖమ్మంపల్లికి చెందిన కోండ్ల చంద్రకళ అనే మహిళ మంగళవారం బైఠాయించి నిరసన వ్యక్తం చేసింది. తమకు సంబంధించిన భూమిలో తాము కాస్తు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని తెలిపింది. తనకు ఇద్దరు పిల్లలున్నారని, భూమి ఇతరులకు అమ్మడంతో తాము జీవనం ఎలా కొనసాగించాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఇతరులకు చేసిన పట్టాను రద్దు చేయాలని ఆమె కోరింది.

## సాంస్కృతిక, చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో ప్రతిభ చాటుకున్న విద్యార్థులు

సుల్తానాబాద్, డిసెంబరు 17: (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి సాంస్కృతిక, చిత్రలేఖనం పోటీలలో ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. ఈ నెల 15న గోదావరిఖని పట్టణం యైటింక్లయిన్ కాలనీలోని స్పందన మోడల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సాంస్కృతిక, చిత్రలేఖనం పోటీల్లో స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచి మొదటి బహుమతులు అందుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపాల్ మాటేటి కృష్ణప్రియ మాట్లాడుతూ ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచి జానపద నృత్యం, చిత్రలేఖనం పోటీల్లో మొదటి బహుమతులను పొందారని, విద్యార్థులను అభినందించారు. చదువు, క్రీడలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు ముందంజలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి : ఏఐవైఎఫ్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రామగుండం కార్పొరేషన్‌లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. మంగళవారం భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఏఐవైఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామగుండం కార్పొరేషన్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఖాజిపల్లిలో నూతనంగా ఎలాంటి అను మతులు లేకుండా పెద్ద భవనాన్ని నిర్మించారని, అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్న టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు సాదుల శివ, నవీన్, సుధీర్‌కుమార్, వినయ్ కుమార్ పాల్గొన్నారు.

## వైద్య, ఆరోగ్య శాఖ పనితీరు మెరుగుపడాలి..



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు చేరువయ్యేలా వైద్య ఆరోగ్య శాఖ పనితీరు మరింత మెరుగు పర్చుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. మంగళవారం కలెక్టర్ కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వైద్యారోగ్య శాఖ పనితీరు గత కొన్ని మాసాలుగా గణనీయంగా మెరుగైందన్నారు. ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా మన పనితీరును ఇంప్రూవ్ చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో అందిస్తున్న కంటి శస్త్రచికిత్సలు, డెంటల్ సేవలు, ఆర్థోపెడిక్ సేవలు, ఫిజియోథెరపీ సేవలు, సైకాలజీ సేవలు, డయాగ్నొస్టిక్ హబ్ మొదలగు అంశాలను ప్రజలు విస్తృతంగా వినియోగించేలా చూడాలన్నారు. క్షయ వ్యాధి నివారణ కోసం జిల్లాలో వంద రోజుల పాటు చేపట్టిన నిక్షయ శిబిర కార్యక్రమం అమలు వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఆసుపత్రుల విస్తరణ అభివృద్ధి పనులపై రివ్యూ చేశారు. సమావేశంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి అన్న ప్రసన్న కుమారి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.




### ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లపై జీఎం సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జీఎం లలిత్ కుమార్

గోదావరిఖని, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై మంగళవారం జీఎం కార్యాలయంలో ఆర్‌జీ-1 జీఎం లలిత్ కుమార్, సేవా అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 23న స్థానిక జవహర్ లాల్ నెహ్రూ క్రీడామైదానంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈనెల 19న ఆర్‌జీ-1 ఉద్యోగుల క్వార్టర్స్‌కు గృహ శోభ పోటీలు నిర్వహించనున్నట్లు, సాయంతం ఏరియా హాస్పిటల్‌లో వెల్‌బేబి షో పోటీలు, బేబి కింగ్, బేబి క్వీన్, ప్రిన్స్ ప్రిన్సెస్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఆర్‌జీ-1 ఉద్యోగుల 5సంవత్సరాలలోపు బాల బాలికలు పాల్గొనాలని తెలిపారు. అలాగే 20న సాయంత్రం జీఎం కాలనీ మైదానంలో దీపాలంకరణ ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు, 21న మధ్యాహ్నం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించబడునని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) డీ కిరణ్ బాబు, సేవా కోఆర్డినేటింగ్ అధికారి హన్మంతరావు, సెక్రటరీ శిరీష, జాయింట్ సెక్రటరీ బీనసింగ్, కోఆర్డినేటర్ మేడి తిరుపతి, సభ్యులు, డ్యాన్స్ మాస్టర్లు, పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

# మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో అందని వైద్య సేవలు

- గైనకాలజిస్టు లేక అవస్థలు - పట్టించుకోని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు




మంథనిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం

మంథని, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి) : మంథని ప్రభుత్వ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గత 11 రోజు లుగా గైనకాలజిస్టు డాక్టర్ లేక గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులు అవస్థలు పడుతున్నారు. నియోజక వర్గంలోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, మల్హర్, కాటారం మండలాలతో పాటు ఇతర మండలా ల్లోని వారికి వైద్య సేవలందించడానికి అందుబాటులో పెద్ద దిక్కుగా ఉన్న 50 పడకల మంథని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్టు డాక్టర్ లేని కారణంగా వైద్య సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఇక్కడ పని చేసిన గైనకాలజిస్టు డాక్టర్ స్రవంతి ఇటీవల బదిలీపై వెళ్లడంతో ఆసుపత్రిలో గైనిక్ సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. దీంతో గోదావరిఖని, పెద్దపల్లి మాతాశిశు ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెల కొంది. ఈ ఆసుపత్రిలో గైనిక్ సేవలు అందుబాటులో ఉన్న సమయంలో నెలకు 50కి పైగా ప్రసూతి కేసులు జరిగినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అత్యవసరంగా ప్రసూతికి ఇక్కడికి వచ్చే గర్భిణులకు డెలివరీ చేయడా నికి కుటుంబ సభ్యులకు పరిస్థితిని వివరించి వారి అను మతితో మిడ్‌వైఫరీలు, స్టాఫ్‌నర్సులు డెలివరీ చేస్తున్నా రు. ఇలా పది రోజుల్లో రెండు డెలివరీలు చేశారు. అత్య వసరంగా తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడానికి ఇలా సేవలు అందిస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి మంథని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్టు సేవలందే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### అత్యవసర కేసులను గోదావరిఖని, పెద్దపల్లికి రెఫర్ చేస్తున్నాం..

- సంపూర్ణ, హెడ్ నర్సు, మాతా శిశు ఆరోగ్య కేంద్రం, మంథని



మంథని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్టు డాక్టర్ లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు ఎవరైనా అత్యవసర వైద్య సేవల కోసం వస్తే వారిని గోదావరిఖని, పెద్దపల్లి ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నాం. ఆరోగ్య పరీక్షలకు వచ్చే వారికి సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు మందులు ఇస్తున్నాం. పురిటి నొప్పులు అధికంగా వస్తే వారి కుటుంబ సభ్యుల అనుమతితో ప్రసూతి చేయడానికి ప్రయత్నం చేస్తున్నాం. ఇలా ఇప్పటి వరకు రెండు కేసులను డెలివరీ చేసి తల్లీబిడ్డలను కాపాడాం.

### రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మంథని, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా అండర్-19 బాలబాలికల విభాగాల్లో క్రీడాకారులను స్థానిక ఫ్రెండ్స్ క్లబ్‌లో మంగళవారం ఎంపిక చేసినట్లు సీఎం కప్ జిల్లా కమిటీ సభ్యుడు, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. బాల, బాలికల విభాగంలో మణికంఠ, సిద్ధార్థ, చిరంజీవ చారి, వరుణ్‌సందేష్, నమిత, విద్యశ్రీ, హసీన్, అక్షర రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకుఅర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో సెలెక్టర్లుగా పీడీలు విజయ్‌కుమార్, జావిద్, సమ్మయ్య, ఖాజాబీలు పాల్గొన్నారు.

### బీమా చెక్కు అందజేత

కమాన్‌పూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన మృతుడు బొంపల్లి బాలకృష్ణ కుటుంబానికి మంగళవారం స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ తరఫున రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కును మేనేజర్ మాపోలు అరుణామోహన్‌గౌడ్ అందజేశారు. మృతుడు బాలకృష్ణ రెండేళ్ల క్రితం ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నారు. ఎనిమిది నెలల క్రితం బాలకృష్ణ మృతిచెందగా మృతుడి భార్య రజితకు చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వైజర్ కొండి రమణ, వేముల శంకర్, మేకల తిరుపతి, వేముల సతీష్‌లు ఉన్నారు.

### రేపు కాలనీలో వెల్‌బేబీ షో

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని ఆర్‌జీ-2 పరిధిలో గురువారం సెక్టార్-3 డిస్పెన్సరీలో వెల్‌బేబీ షో పోటీలు నిర్వహిస్తున్నట్లు డీజీఎం పర్సనల్ ఎస్. అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 12.30గంటల వరకు జరుగుతాయని, సంవత్సరం నుంచి ఐదేళ్లుగల ఉద్యోగుల పిల్లలు మాత్రమే అర్హులని, పోటీలో పాల్గొనే తల్లిదండ్రులు పిల్లల పుట్టిన తేది ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలన్నారు. గెలుపొందిన పిల్లలకు 23న బహుమతులు అందజేస్తామని తెలిపారు.